క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

కడ్తాల్: ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

ఆమనగల్లు: మండల పరిధిలోని రాంనుంతల పరిధిలోని అయ్యసాగరం అటవీ ప్రాంతంలో వెలిసిన సీతారామాంజనేయస్వామి దేవాలయంలో మంగళ, బుధవారాల్లో శ్రీ రామనవమి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

అయ్యప్ప మహాపడిపూజ

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని కొండపై వెలిసిన అయ్యప్పస్వామి దేవాలయంలో ఆదివారం రాత్రి మహా పడిపూజను వైభవంగా నిర్వహించారు. దేవాలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజ్‌దేశ్ పాండే గురుస్వామి నేతృత్వంలో బీజేపీ సీనియర్ నేత, అయ్యప్ప దేవాలయ వ్యవస్థాపకులు ఆచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. అల్లాజీగౌడ్, మురళీధర్, నర్సింహ, మహేశ్, శ్రీశైలం, సాయి, రవి, టిల్లుయాదవ్, కిట్టు, శ్రీను, కుమార్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

గుడిసె దగ్ధం



ఆమనగల్లు: మండల పరిధిలోని శెట్టిపల్లికి చెందిన రామచంద్రయ్య గుడిసె సోమవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. రామచంద్రయ్య పొలానికి ఆనుకొని ఉన్న గుడిసెకు నిప్పంటుకోవడంతో గుడిసెలో ఉన్న వ్యవసాయ పనిముట్లు, కల్లు డ్రమ్ములు దగ్ధమయ్యాయి. చుట్టుపక్కలవారు, స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ జరగాల్సిన నష్టం జరిగిపోయింది. గుడిసె పూర్తిగా దగ్ధమైందని తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

'బూర' గెలుపే లక్ష్యం

బీజేపీ నేత సురేష్ గౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్: లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అబ్దుల్లాపూర్‌మెట్ మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి సురేష్‌గౌడ్ కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మట్లాడుతూ కేంద్రంలో ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లో తీసుకెళ్లాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు.

మల్లురవిని గెలిపించుకుందాం

పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి

తలకొండపల్లి: కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవిని భారీ మెజార్టీతో గెలుపించుకుందామని పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి అన్నారు. కాంగ్రెస్ నేత శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సోమవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కసిరెడ్డి నివాసంలో మల్లు రవి, జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజిసింగ్‌ను వారు కలిశారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రచారంపై చర్చించారు. కాంగ్రెస్ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. అందరం కలిసికట్టుగా పనిచేసి మల్లురవిని గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు.. తిరుపతయ్య, బాల్‌రెడ్డి, చంద్రయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటిపన్ను చెల్లింపుపై రాయితీ: కమిషనర్

పహాడీషరీఫ్: 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్ను మొత్తాన్ని ఈ నెల 30 లోపు చెల్లించిన గృహ యజమానులకు 5 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రజలు రాయితీ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 2023–24 సంవత్సరానికిసంబంధించి ఆస్తి పన్ను పెండింగ్ ఉన్న వారు కూడా వెంటనే చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఇంటింటికి వసూలుకు వచ్చే బిల్ కలెక్టర్, మున్సిపల్ కార్యాలయం, ఆన్‌లైన్‌లో ఏదో ఒక రూపేణా చెల్లించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని పుర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయె



మైసిగండి రామాలయం

- నేటి నుంచి మైసిగండిలో శ్రీరామనవమి ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయ కమిటీ

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి శివరామాలయాలలో కొలువైయున్న శ్రీ కోదండ రామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏటా శ్రీరామనవమిని పురస్కరించుకుని నిర్వహించే ఈ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకలకు సంబంధించి ఆలయ ఈఓ స్నేహలత, ఆలయ ఫౌండర్, ట్రస్టీ శిరోలీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేడుకలను తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు.



ఉత్సవ మూర్తులు

ఆలయ చరిత్ర..

మైసిగండిలో ప్రస్తుత శివాలయ, రామాలయ దేవాలయాలు ఋగ్వేద కాలంలో గంగా గుళ్లగా పిలువబడేవని ఆలయ చరిత్ర తెలుపుతోంది. వందల, వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయం గోల్కొండ నవాబుల కాలంలో అక్కన్న, మాదన్న మహామంత్రులుగా ఉన్న సమయంలో విశేష పూజలు అందుకునేవి. తదనంతరం దాతలు, ప్రభుత్వ సహకారంతో ఆలయ పునఃనిర్మాణం చేపట్టారు. ఆలయ పరిసరాల్లో ఉన్న కోనేరులో స్నానాలు ఆచరిస్తే రోగాలు, పాపభీతి తొలగిపోతాయని భక్తుల నమ్మకం.

అధికారికంగా..

17వ తేదీన నిర్వహించే కల్యాణ మహోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ, ధర్మాదాయ శాఖ వారి నుంచి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. హైదరాబాద్ నుంచి 44 కిలో మీటర్ల దూరంలో కడ్తాల్ మండలం మైసిగండి సమీపంలో ఉన్న ఈ ఆలయానికి చేరుకోడానికి హైదరాబాద్ ఎంజీబీఎస్, సంతోష్‌నగర్, కల్వకుర్తి నుంచి ప్రతి 5 నిమిషాలకు బస్సు సౌకర్యం కలదు.



కడ్తాల్: ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించుకుందాం

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ నేత, జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార రథాన్ని జెడ్పీటీసీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్‌లుసులోచన, హరిచంద్, నాయకులు రామకృష్ణ, లాయక్‌అలీ, సేవ్యా, పాండు, రమణ, నర్సింహ, వెంకటేశ్, కృష్ణ తదితరులు ఉన్నారు.

నల్లావారిపల్లిలో..

మాడ్గుల: నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమాను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఆర్.ఎస్.పీ సపోర్టర్స్ మీట్ ఆఫ్ ఆర్గనైజర్ శ్రీధర్ గోవింద్ అన్నారు. సోమవారం ఆయన నల్లావారిపల్లిలో ఆర్.ఎస్.పీ సపోర్టర్స్ మీట్ ఆఫ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాజకీయాలకతీతంగా ప్రవీణ్‌కుమార్‌కు ప్రజలు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పార్వతమ్మ, మహేష్, వరుణ్, ఆర్.ఎస్.పీ అభిమానులు పాల్గొన్నారు.

హంసమ్మకు స్వర్ణనంది పురస్కారం

ఇబ్రహీంపట్నం రూరల్: కప్పపహాడ్ మాజీ సర్పంచ్ సామల హంసమ్మకు అరుదైన గౌరవం దక్కింది. ఆదివారం రాత్రి నగరంలోని ఆదర్శ కళానిలయంలో డాక్టర్ వేవులపల్లి రామనుజరావు కళామందిర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది పురస్కారాల్లో ఆమెకు స్వర్ణనంది పురస్కారం దక్కింది. చేరాల ప్రకాష్‌చేతుల మీదుగా హంసమ్మ దంపతుకు అవార్డు అందజేశారు. హంసమ్మ మాట్లాడుతూ.. గ్రామానికి తాను అందించిన సేవలకు గాను ఈ గౌరవం దక్కడం సంతోషంగా ఉందన్నారు. అందరి సహకారంతోనే కప్పపహాడ్‌ను అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నానన్నారు.



హంసమ్మ దంపతులను సన్మానించిన అతిథులు

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం



కసిరెడ్డి, మల్లురవి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- హస్తం పార్టీలో భారీగా చేరికలు

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డా.మల్లురవి అన్నారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో సోమవారం ఆమనగల్లు వైస్ ఎంపీపీ, బీఆర్ఎస్ సీనియర్ నేత అనంతరెడ్డి, ఆకుతోటపల్లి ఎంపీటీసీ మంగమ్మ, మంగళపల్లి, ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పార్టీపై ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ అసత్య ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. కేంద్రంలో ఎలాగైనా మరోసారి అధికారంలోకి రావడానికి బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొడుతోందని ఆయన ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు. కాంగ్రెస్‌లో చేరినవారిలో నారాయణరెడ్డి, వెంకటనర్సింహారెడ్డి, సాయిరెడ్డి, నరేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, జంగయ్య, పురుషోత్తం, నిరంజన్, యాదగిరి, మైసయ్య, వెంకటయ్య, మల్లేశ్, జంగారెడ్డి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, నా యకులు.. జంగయ్య, కేశవులు, శ్రీనివాస్‌రెడ్డి, మా జీ ఎంపీపీ రాంరెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరుణోదయ క్లబ్ సేవలు ప్రశంసనీయం

చేవెళ్ల: మండలంలో అరుణోదయ యూత్ క్లబ్ ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను చేస్తూ ముందుకు నడుస్తోందని క్లబ్ అధ్యక్షుడు జూలకంటి పాండురంగారెడ్డి అన్నారు. శంకర్‌పల్లి మండలంలో ఆ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం విభూది సురేశ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు బహుమతుల కార్యక్రమంలో పాల్గొన్న పలువురు మండల నాయకులు మాట్లాడుతూ.. క్లబ్‌లో ప్రధాన కార్యదర్శిగా పనిచేసి ఇటీవల ఆకస్మిక మరణం పొందిన విభూది సురేశ్(లాలి) మరణం బాధాకరమన్నారు. ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. ఈ సందర్భంగా అతని పేరుపైనే నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేత జట్టుకు రూ.5వేల నగదు బహుమతి, ద్వితీయ బహుమతి 2500ల రూపాయల నగదు, షీల్డ్‌లను ఇరుజట్లకు అందజేశారు. యూత్‌ను ప్రోత్సహించేందుకు ఇలాంటి టోర్నమెంట్‌లు నిర్వహించటం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు శంకర్‌పల్లి మండల నాయకుడు సాత ప్రవీణ్‌కుమార్ 10వేలు, యూత్ క్లబ్ అధ్యక్షుడు జూలకంటి పాండురంగారెడ్డి 50వేలు, మజ్జు కుద్దూస్‌లు 10వేల రూపాయలను సురేశ్ కుటుంబా నికి అందజేశారు. ఆయన మృతికి అంతా సానుభూతి తెలిపారు. క్లబ్ సేవలను పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవ అధ్యక్షుడు ప్రకాశ్‌గుప్తా, మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, నాయకులు మోహన్‌రెడ్డి, ప్రవీన్‌కుమార్, ప్రణీత్‌కుమార్, మోహన్, నాగభూషనం, సంజీవ్‌కుమార్, గోవర్దన్‌రెడ్డి, మల్లేశం తదితరులు ఉన్నారు.



సురేశ్ కుటుంబానికి నగదు అందిస్తున్న క్లబ్ సభ్యులు, నాయకులు

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రికెట్ టోర్నమెంటును ప్రారంభిస్తున్న శ్రీలత

కొత్తూరు: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని జెడ్పీటీసీ ఎమ్మె శ్రీలత అన్నారు. మండలంలోని ఎస్‌బీపల్లి గ్రామంలో సోమవారం క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె ప్రారంభించారు. అదేవిధంగా పెంజర్ల గ్రామంలో గల బీరప్ప ఆలయంలో నిర్వహించిన స్వామివారి కల్యాణ వేడుకల్లో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. దైవచింతన కలిగిన వారు ఇతరులకు సాయం చేయడంతో పాటు ప్రేమానురాగాలతో మెలుగుతారని తెలిపారు. నాయకులు సత్యనారాయణ, శ్రీశైలం పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఇబ్రహీంపట్నం రూరల్: జెడ్పీహెచ్ఎస్ 1986-87 బ్యాచ్ విద్యార్థులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి కొంగరకలాన్‌లోని రావిర్యాల ప్రభుత్వ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల 1986–87 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. కొంగరకలాన్‌లోని స్లోకా కన్వెన్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులను వారు ఘనంగా సన్మానించారు. అంతా ఒక్కచోట చేరి అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 37 సంవత్సరాల తర్వాత అందరూ ఒక్కదగ్గర కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు శ్రీనివాస్‌రావు, లక్ష్మీపతిగౌడ్, అశోక్‌గౌడ్, నారాయణ, జయరాజు, చంద్రశేఖర్, లక్ష్మీనారయణ, ప్రభు, రాంభూపాల్‌రెడ్డి, ఉమారాణి, భారతి, వసుమతి, స్వరూపరాణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మంచాల: 2006-07 బ్యాచ్ విద్యార్థులు

జాపాల జెడ్పీహెచ్ఎస్‌లో..

మంచాల: మండల పరిధిలోని జాపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. 2006–07 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులతో పాటు అప్పటి ఉపాధ్యాయులు 16ఏళ్ల తర్వాత ఒకేచోట చేరి సందడి చేశారు. విద్యాబుద్ధులు నేరిప్పిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల సందేశాలు, ఆటపాట, వినోద కార్యక్రమాలతో రోజంతా ఉత్సాహంగా గడిపారు.

కాంగ్రెస్ నేదునూరు కమిటీల ఎన్నిక



కమిటీ సభ్యులతో నాయకులు

కందుకూరు: మండలంలోని నేదునూరులో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం కాంగ్రెస్ మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీని ప్రకటించారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా బొర్రా సురేశ్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా బోయభాస్కర్, అంకగళ్ల జగన్, బనావాత్ శ్రీనివాస్, ఎండీ పర్వేజ్‌లను ఎన్నుకున్నామన్నారు. ఈ సందర్భంగా అఫ్జల్‌బేగ్, శమంతప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాధవరెడ్డి, సురేందర్‌రెడ్డి, బాబు, సంజీవ, రాకేష్‌గౌడ్, నర్సింహ, ఆరోగ్యరెడ్డి, దర్శన్, సద్దాం, శ్రీశైలం, మైసయ్య,రాములు, పరమేశ్వర్, సంజీవరెడ్డి, సురేందర్‌రెడ్డి, శంకర్, బాబుజానీ, రాకేశ్, శివ, మహేశ్, పాండు, శ్రీరాములు, రత్నం, సుధాకర్, జగన్, నర్సింహ, కుమార్, యాదయ్య, లోకేశ్, ఇలియాజ్, అజారుద్దీన్, నాగరాజ్, పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్

సినీ నటుడు, యాంకర్ బిత్తిరి సత్తి

చేవెళ్ల: విద్యతోనే విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాట పడుతుందని సినీ నటుడు, యాంకర్ బిత్తిరి సత్తి అలియాస్ కావలి రవికుమార్ అన్నారు. మండలంలోని ఆలూరు గ్రామంలో గల తక్షశిల ఉన్నత పాఠశాల 16వ వార్షికోత్సవాన్ని పాఠశాల చైర్మన్ సయ్యద్ బాబర్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులతో కలిసి ఆడుతూ పాడుతూ వారిని నవ్వించారు. ముందుగా గ్రామంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బిత్తిరి సత్తి వచ్చాడని తెలియటంతో గ్రామంలోని ప్రజలు సైతం పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిత్తిరి సత్తి విద్యార్థులను ఒక వైపు నవ్విస్తూనే వారిని బాగా చదువుకోవాలని ప్రోత్సహించాడు. ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా తనకు మండలంలోని అన్ని గ్రామాలతో పరిచయం ప్రత్యేక అనుబంధం ఉందని చెప్పారు. విద్యార్థులు బాగా కష్టపడి చదివిదే తప్పకుండా మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చెప్పిన మాటలు వినాలన్నారు. 16 ఏళ్లగా గ్రామంలోని విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్న పాఠశాల చైర్మన్, విద్యారత్న జాతీయ అవార్డు గ్రహీత సయ్యద్ బాబర్‌ను ప్రత్యేకంగా అభినందించాల్సిందేనన్నారు. విద్యార్థుల ఆటపాటల్లో బిత్తిరి సత్తి పాల్గొని వారితో ఆడిపాడి అందరినీ నవ్వించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



చిన్నారులతో కలిసి నృత్యం చేస్తున్న బిత్తిరి సత్తి

ఎరువులు అందుబాటులో ఉంచాలి: ఏడీఏ

కొందుర్గు: రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని షాద్‌నగర్ ఏడీఏ రాజారత్నం సూచించారు. సోమవారం ఆయన కొందుర్గు, రామచంద్రాపూర్, వెంకిర్యాల తదితర గ్రామాల్లో పర్యటించి ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీలర్లు ఈ పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలని సూచించారు. రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలన్నారు. కాల పరిమితి, లాట్ నెంబర్ విధిగా బిల్లుపై రాయాలన్నారు. స్టాకు రిజిస్టర్లను తప్పనిసరిగా ఎప్పటికప్పుడూ నమోదు చేయాలని సూచించారు.

రైతులను ఆదుకోలేని అసమర్థ కాంగ్రెస్



రైతుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



ఆలయంలో పూజలు చేస్తున్న సబితారెడ్డి తదితరులు

ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: రైతుల్ని ఆదుకోని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్సేనని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి విమర్శించారు. సోమవారం మండలంలోని దాసర్లపల్లి తండాలోని అభయాంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరిగివెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో ఓ రైతు ఎమ్మెల్యే కారును ఆపి కరెంట్ కోతల కారణంగా పంటలు ఎండిపోతున్నాయని వాపోయాడు. ఆమె ఆ రైతు సమస్యలు వినిధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు ఇవ్వాల్సిన రూ.2 లక్షల రుణ మాఫీ ఏమైయిందని ప్రశ్నించారు. 24 గంటల కరెంట్ ఇవ్వకుండా రైతుల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ హయాంలో నిరంతరం విద్యుత్ సరఫరా చేశామని గుర్తు చేశారు. రైతు సమస్యలను పరిష్కరించ గల సత్తా ఒక్క కేసీఆర్‌కే సాధ్యమన్నారు. జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటు వేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు ఇందిరదేవేందర్, ఎంపీటీసీలు సురేశ్, రాజశేఖర్‌రెడ్డి, నాయకులు కరుణాకర్‌రెడ్డి, దేవీలాల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.